www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
సోమవారం 12 మే 2025
సంపుటి :06 సంచిక : 341 , పేజీలు : 12 వెల:రూ.5/-
తెలుగు దినపత్రిక
TELANGANA, ANDHRA PRADESH

# చెట్ల కింద నిరీక్షణకు దశలవారీగా తెర

- **నేటి నుంచి (12వ నుంచి) మరో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్**
- **అధిక రద్దీ కార్యాలయాల్లో అదనపు సిబ్బంది నియామకం**
- **వచ్చే నెల చివరినాటికి రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్**
- **రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ వెలుతురు మే 11:**
ప్రజల సమయాన్ని ఆదా చేసేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని రెవిన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కు వచ్చే కొనుగోలుదారులు, అమ్మకందారులు గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించవలసిన పరిస్థితిని మార్చుతూ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఆధునికీకరించడమే కాక, స్లాట్ బుకింగ్ విధానాన్ని దశలవారీగా అమలులోకి తీసుకొస్తున్నామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటికే గత నెల పదవ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేశామని అక్కడ విజయవంతం కావడంతో ఈ నెల 12వ తేదీ నుంచి మరో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని ప్రకటించారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్రంలోని 144 సబ్- రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేయవలసిన బాధ్యత అధికారులదే స్పష్టం చేశారు.
పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి మరియు 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని, ఇప్పటికే ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు మరియు సిబ్బందిని నియమించడం జరిగిందని తెలియజేస్తూ విజయవంతమైన ఈ విధానాన్ని ఉప్పల్, మహేశ్వరం మరియు మంచిర్యాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రవేశపెడుతూ అదనంగా ఒక్కొక్క సబ్ రిజిస్ట్రార్ ని నియమించడం జరుగుతుంది అని తెలియజేశారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యస్తీకరణ చేస్తున్నామని, ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని , ఇందులో భాగంగా ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట మరియు సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధి విలీనం విజయవంతం కావడంతో షాద్ నగర్ మరియు ఫారూక్ నగర్ సిద్దిపేట మరియు సిద్దిపేట (రూరల్) విలీనం చేయడం జరిగిందన్నారు.

**నేటి నుంచి స్లాట్ బుకింగ్ అమలు కానున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు :**

హైదరాబాద్ ఆర్.ఓ. ఆఫీసు, హైదరాబాద్ ఆర్.ఓ. ఆఫీసు సౌత్ , నారపల్లి, ఘట్కేసర్, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బీబీనగర్, సిద్దిపేట్, సిద్దిపేట్ రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ ఆర్.ఓ. ఆఫీసు, జనగాం, ఘన్పూర్, నర్సంపేట, కల్వకుర్తి, నారాయణపేట, మహేశ్వరం, రంగారెడ్డి ఆర్.ఓ. ఆఫీసు, షాద్ నగర్, ఫరూక్ నగర్ , వనస్థలిపురం, శేరిలింగంపల్లి.

## పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రిలలో వెళ్ళినప్పుడు పూర్తిస్థాయిలో చికిత్స అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు మే 11:**
పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రిలలో వెళ్ళినప్పుడు పూర్తిస్థాయిలో చికిత్స అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు, ఆదివారం అదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఆయుష్మాన్ భారత్ ను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎంఆర్ఎఫ్ పరిమితిని పెంచాలని సూచించారు. ఈ విషయంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ముందు జాగ్రత్తగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు, కార్యక్రమంలో నాయకులు. ఆకుల ప్రవీణ్ కరుణాకర్ రెడ్డి రాకేష్ రెడ్డి సన్నీ మయూర్ చంద్ర. జోగు రవి. రమేష్. శివ తదితరులున్నారు

## మీ మధ్యవర్తిత్వం అవసరం లేదు

**- ట్రంప్ కి షాక్ ఇచ్చిన మోడీ**



**ఢిల్లీ, వెలుతురు మే 11:**
పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్

2 లో..




## కాల్పుల విరమణ ఒప్పందం... తెరవెనుక అసలేం జరిగింది?

- **పాక్ కాల్పుల విరమణ ప్రతిపాదన... భారత్ ఆచితూచి స్పందన**
- **తొలుత పాక్ నుంచే ప్రతిపాదన**
- **అప్పటికే పాక్ లోని కీలక స్థావరాలపై భారత్ భీకర దాడులు**
- **తీవ్ర ఒత్తిడిలో కాల్పుల విరమణ నిర్ణయం తీసుకున్న పాక్!**



**ఢిల్లీ, వెలుతురు మే 11:**
దాయాది దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్న వేళ, ఎవరూ ఊహించని రీతిలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సోషల్ మీడియాలో ట్రంప్ చేసిన పోస్టు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అప్పటివరకు, ఈ

2 లో..

### రాష్ట్రాల నుండి కేంద్రం వరకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో

# బీసీ లకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ..

- **బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన బిల్లును ఆమోదింపజేసి బీసీ లపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి..**
- **మంత్రి పొన్నం ప్రభాకర్,రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ**



**హైదరాబాద్ వెలుతురు మే 11:**
రాహుల్ గాంధీ గారు దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడోయాత్ర సందర్భంగా జిత్నే ఆబాది ఉత్నె ఇస్సేదారి అని దేశ వ్యాప్తంగా ఉన్న సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కుల గణన చేస్తామని మా నాయకుడు రాహుల్ గాంధీ గారు హామీ ఇచ్చారు.. రాహుల్ గాంధీ గారి హామీ మేరకు ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారు ,సహచర కేబినెట్ మంత్రులు అంత కలిసి తెలంగాణ లో కుల గణన లో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా బీసీ కుల సర్వే చేపట్టాం.. బీసీ కమిషన్ వేసుకొని , బుసాని వెంకటేశ్వర రావు గారితో డెడికేటెడ్ కమిషన్ వేసుకొని లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో పారదర్శకంగా కుల సర్వే నిర్వహించాం.. ఇప్పటికైనా బీసీ లకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయసభల్లో చేసిన చట్టాన్ని గవర్నర్ ఆమోదించి రాష్ట్రపతికి పంపించిన చట్టాన్ని ఆమోదించే బాధ్యత తెలంగాణ బీజేపీ నాయకులదే.. మహారాష్ట్ర లో బీసీ కుల గణన చేస్తామని అసెంబ్లీ లో తీర్మానం చేయగానే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చారు.బీహార్ లో కుల గణన చేపట్టి ఆ నివేదిక అసెంబ్లీ లో ప్రవేశపెట్టక ముందే ఆర్జేడీ, జేడీయూ ప్రభుత్వాన్ని కూల్చేసింది. జార?ండ్ లో బీసీ ల రిజర్వేషన్లు పెంచుతామని అసెంబ్లీలో తీర్మానం పెట్టగానే తప్పుడు కేసులతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ను జైల్లో వేసారు.. అటువంటి చరిత్ర బీజేపీ కేంద్ర ప్రభుత్వం ది.. లక్ష్మణ్ కు మా కుల గణన మీద అనుమానాలు ఉంటే నివృతి చేయడానికి సిద్ధంగా ఉన్నాం మీరు ప్రధాని వద్ద సమయం ఇప్పిస్తారా..? ఎంతో పెద్ద బీసీ సంఘాలు మేధావుల వద్ద మేము ఏ రకంగా బీసీ కుల గణన చేపట్టామో వారికి వివరించాం.. వారందరూ కూడా ప్రభుత్వాన్ని ప్రశంసించారు.. కానీ మీరు మాత్రం కాళ్లలో కట్టిపెట్టి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు రాష్ట్రాల నుండి కేంద్రం వరకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో బీసీ లకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ.. బీజేపీ అధ్యక్ష పదవి,శాసన సభలో బీజేపీ ప్రతిపక్ష నాయకుడి పదవి ,మండలి లో పక్ష నాయకుడి పదవి లకు బీసీ లు పనికిరారా..? అన్ని అత్యున్నత పదవులు వేరే సామాజిక వర్గానికి కేటాయించిన బీసీ లపై మొసలి కన్నీరు కారిస్తే సమాజం అంగీకరిస్తుందా.. మీరు ధరలు పెంచినా, ఉద్యోగాల్లో, సంక్షేమరంగాల్లో కోత విధిస్తున్నా ఎక్కువగా నష్టపోయేది బీసీ సామాజిక వర్గమే. వారి సంక్షేమము దృష్టిలో చేతనైతే బీసీలకు ప్రయోజనాలు కల్పించాలి అంతేతప్ప.. ఒక సాహసోపేతమైన నిర్ణయాన్ని అమలు చేసే ప్రయత్నం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ కృషికి గండి కొట్టొద్దు బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన బిల్లును ఆమోదింపజేసి బీసీ లపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.. బీసీ కేంద్ర విద్యా సంస్థలైన ఐఐటీ, ఐఐఎమ్ లాంటి వాటిలో కూడా బీసీ లకు రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వలది.. బీసీ ల విషయంలో కాంగ్రెస్ పార్టీ పై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి.. కుల గణన కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళ్లి అఫిడవిట్ సమర్పించిన చరిత్ర బీజేపీ ది మండల్ కమిషన్ వస్తె కమండలం తీసుకొచ్చింది బీజేపీ.. బీజేపీ అగ్రవర్ణాల ఫ్యూడలిస్ట్ పార్టీ కుల గణన చేసి బీసీ లకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచి చేసిన చట్టం తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా మారింది.. తెలంగాణ ను చూసే తప్పని పరిస్థితుల్లో కేంద్రంలో జన గణన తో పాటు కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.. తెలంగాణ లో చేసిన కుల గణన చూసి దేశ వ్యాప్తంగా చేస్తున్నారు.. ఇక్కడ చేసిన కుల సర్వే ఆధారంగా పెంచిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతూ చేసిన చట్టాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు ఆమోదింపజేసి బీసీ లకు న్యాయం చేయాలి

## ఆపరేషన్ సింధూర్ పై త్రివిధ దళాధిపతుల వివరణ !




**ఢిల్లీ, వెలుతురు మే 11:**
ఆపరేషన్ సిందూర్ ను వివరిస్తూ భారత సాయుధ దళాధిపతులు ఈరోజు (ఆదివారం) సంయుక్త విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (DGMO) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, ఎయిర్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (DG ఎయిర్

2 లో..

## నాగార్జునసాగర్ కు అందాలభామలు !



**హైదరాబాద్ వెలుతురు మే 11:**
తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ – 2025 పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. ఇప్పటికే అట్టహాసంగా ప్రారంభమైన ఈ అంతర్జాతీయ అందాల

2 లో..

## మురళి నాయక్ కుటుంబానికి పవన్ కల్యాణ్ అండ



**శ్రీ సత్యసాయి వెలుతురు మే 11:**
రాష్ట్ర డిప్యూటీ సీఎం, పవన్ కళ్యాణ్ ఆదివారం ఉదయం 9:30 గంటలకు గోరంట్ల మండలం కల్లి తండా కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన వీర జవాన్ మురళి నాయక్ పార్థివ దేహానికి నివాళులు అర్పించి, అనంతరం మురళి తల్లిదండ్రులు శ్రీరామ నాయక్, జ్యోతిబాయ్ లను ఓదార్చారు. ముఖ్యంగా మురళి నాయక్ తల్లి జ్యోతిబాయ్ ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అక్కున చేర్చుకొని, కుమారుడి మరణం వీర మరణమని, వీరమరణం పొందిన మురళి నాయక్ ఆశయం కోసం తాము ఉన్నామన్నారు. ఎలాంటి అధైర్యానికి గురి కాకుండా ఓర్పు వహించాలని కోరారు. భవిష్యత్తులో మీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి..)

## మీ మధ్యవర్తిత్వం అవసరం లేదు

అంశంపై మధ్యవర్తులు అవసరం లేదని ప్రధాని తేల్చి చెప్పారు.
పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా పాకిస్థాన్‌కు మరో మార్గం లేదని ఆయన అన్నారు. కాశ్మీర్ అంశం పరిష్కరించుకునేందుకు తాము మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా చెప్పిన వేళ ప్రధాని వ్యాఖ్యలు ఒక్కసారిగా హీటెక్కించాయి. కాశ్మీర్ విషయంలో భారత్ వైఖరి ఎప్పుడూ ఒక్కటేనని మోదీ కుండబద్దలు కొట్టారు.
కాశ్మీర్ విషయంలో ఇంతకుమించి మాట్లాడేదేమీ లేదని సుస్పష్టం చేశారు. ఉగ్రవాదులను అప్పగించే విషయంపై పాక్ మాట్లాడితే.. మేమూ మాట్లాడతామని ప్రధాని మోదీ చెప్పారు. ఇక త్రివిధ దళాల అధిపతులకు మోదీ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసిపోలేదని అన్నారు. పాక్ దాడులకు దిగితే.. భారత్ సైతం ఎదురుదాడి చేస్తుందని ప్రధాని మోదీ హెచ్చరించారు.పాక్ కాల్పులకు దిగితే గట్టిగా బదులివ్వండంటూ త్రివిధ దళాల అధిపతులకు ప్రధాని మోదీ సూచించారు.
అటు నుంచి తుపాకీ గుళ్లు వస్తే.. భారత్ నుంచి మిస్సైల్స్ ప్రయోగించాలని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌తో ప్రపంచానికి కొత్త సందేశం పంపామన్నారు. ఉగ్ర శిబిరాల సహా హెడ్ క్వార్టర్స్‌ను ధ్వంసం చేశామని చెప్పారు. వైమానిక దాడుల తర్వాత పాకిస్థాన్ చేతులెత్తేసిందని ఆయన పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని సీమాంతర ఉగ్రవాదంతో ముడిపెట్టామని.. ఉగ్రదాడులు ఆగే వరకు ఒప్పందం నిలుపుదలలోనే ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ పై త్రివిధ దళాధిపతుల వివరణ !

ఆప్స్) అవధేష్ కుమార్, నావల్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (DGNO) రియర్ అడ్మిరల్ A.N. ప్రమోద్ నాయకత్వం వహిస్తున్నారు.
ఈ విలేకరుల సమావేశంలో త్రివిధ దళాల అధిపతులు ఆపరేషన్ పురోగతిని, వ్యూహాత్మక దృక్పథాన్ని దేశ ప్రజలకు వివరిస్తున్నారు. ఈ ప్రెస్ మీట్‌లో ఎయిర్ ఆపరేషన్స్ డిజీ మాట్లాడుతూ.. గైడెడ్ మిస్సైల్స్‌తో రెండు ఉగ్ర సంస్థల శిభిరాలను ధ్వంసం చేశామని%ా% పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 4, పాకిస్తాన్‌లో 5 ఉగ్ర శిబిరాలను నిర్వీర్యం చేసినట్లు వివరించారు.
9 ఉగ్ర శిబిరాలు ధ్వంసం
"పౌరులు లేదా సైనిక స్థావరాలు మా లక్ష్యం కావు. ఉగ్రవాద శిబిరాలపై మాత్రమే దాడులు నిర్వహించాం," అని ఎయిర్ ఆపరేషన్స్ డిజీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని, 9 శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆయన ప్రకటించారు.
మే 8, 9 తేదీల్లో పాక్ డ్రోన్లు భారత భూభాగంలోకి చొరబడ్డాయని, జమ్ము, ఉధంపూర్, పఠాన్‌కోట్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాక్ దాడులకు పాల్పడిందని తెలిపారు. శ్రీనగర్ నుంచి నలియా వరకు పాక్ డ్రోన్లు వచ్చినట్టు వెల్లడించారు. అయితే భారత రక్షణ వ్యవస్థ ప్రతి పాక్ డ్రోన్‌ను నిర్వీర్యం చేసినట్టు చెప్పారు.
ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు..
పాక్ దాడులు జరిపితే.. భారత్ కూడా ప్రతిస్పందించడానికి వెనుకాడదని త్రివిధ దళాలు స్పష్టం చేశాయి. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేవరకు దాడులు కొనసాగుతాయని తెలిపారు. భారత ఎయిర్ డిఫెన్స్ బ్రహ్మాండంగా పనిచేసిందని అధికారులు తెలిపారు.
పాక్ డ్రోన్లు భారత ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడానికి ప్రయత్నించాయి. అయితే మన ఎయిర్ డిఫెన్స్ అద్భుతంగా తిప్పికొట్టిందన్నారు. పాక్ డ్రోన్ దాడి తర్వాత ప్రతిదాడి తప్ప వేరే మార్గం లేకుండా పోయిందని వివరించారు.
ఆరంభంలో భారత్ పాక్ ఉగ్ర స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించిందని, కానీ పాక్ కవ్వింపు చర్యలతో పరిస్థితులు మారాయని తెలిపారు.
పాక్ డీజీఎంఓ కాల్పుల విరమణకు అభ్యర్థించింది. అనంతరం సీజ్ ఫైర్‌ను ఉల్లంఘించింది. పాక్ డీజీఎంఓతో రేపు మరోసారి భారత్ చర్చలు జరపనుంది. పాక్ మళ్లీ సీజ్ ఫైర్ ఉల్లంఘిస్తే భారత్ ప్రతిస్పందన సీరియస్‌గా ఉంటుందన్నారు. భారత ప్రజల భద్రతకు ముప్పు కలిగిస్తే సహించేది లేదు. అమర జవాన్ల త్యాగాలను దేశం ఎన్నటికీ మరచిపోదని అధికారులు స్పష్టం చేశారు.

## నాగార్జునసాగర్ కు అందాలభామలు !

పోటీ 72వ ఎడిషన్‌లో 110కి పైగా దేశాల నుండి అందగత్తెలు మిస్ యూనివర్స్ కిరీటం కోసం పోటీ పడుతున్నారు.భారతదేశం తరపున మిస్ ఇండియా నందిని గుప్తా పోటీ పడుతోంది.
ఇదిలా ఉండగా, అందాల భామలు బృందాలుగా ఏర్పడి తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ దేవాలయాలను సందర్శిస్తారు. ఈ క్రమంలో వారు రేపు (మే 12) నాగార్జునసాగర్‌లోని బుద్ధ పార్కును సందర్శించనున్నారు.
బుద్ధ పూర్ణిమ కావడంతో బుద్ధుడికి పుష్పాంజలి ఘటిస్తారు. మహాస్థూపంపై ఉన్న విగ్రహాల గురించి వారికి ప్రముఖ బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి వారికి వివరిస్తారు. చివరగా మహాస్థూపం లోపల ధ్యానం చేసి ఐదు నిమిషాల పాటు మాంగ్స్ చాటింగ్‌లో పాల్గొంటారు. మహా స్తూపం నుంచి జాతక పార్కును సందర్శించి బుద్ధుడి చరిత్ర, తెలంగాణ బుద్ధిజం, బౌద్ధ విశేషాలు తెలుసుకుంటారు. బుద్ధ వనంలో డిన్నర్‌లో పాల్గొని తిరిగి హైదరాబాద్ బయలుదేరుతారు.
దీంతో పోటీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఘనంగా బీరప్ప స్వామి బోనాల కార్యక్రమం





రామన్నపేట వెలుతురు న్యూస్ మే 11

నూతనంగా ఏర్పాటు చేసుకున్న బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం లో భాగంగా ఆదివారం రోజున బీరప్ప బోనాల కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పెద్ద కురుమ మోటే. లక్ష్మణ్ సెలవోజి ఈతప్పుల రాజు ,గుడి చైర్మన్ మోటే మల్లేష్,గొరిగే బీరప్ప, గోరిగే నరసింహ,చిందం లింగయ్య, మిర్యాల మల్లేష్, మోటే. రమేష్, గొరిగే శంకరయ్య, మోటే అంజయ్య, బండ లింగస్వామి, బేడిద లింగస్వామి, మోటే క్రాంతి, గొరిగే.కృష్ణ, కుల పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాల్పుల విరమణ ఒప్పందం... తెరవెనుక అసలేం జరిగింది?

వ్యవహారంలో అమెరికా పెద్దగా జోక్యం చేసుకున్నట్టు కనిపించకపోవడమే ఈ ఆశ్చర్యానికి కారణం. ఈ నేపథ్యంలో, అసలేం జరిగిందన్నది భారత అధికారులు వెల్లడించారు.
భారత్ ముమ్మరంగా దాడులు చేస్తున్న వేళ పాకిస్థాన్ నుంచి కాల్పుల విరమణ ప్రతిపాదన అందింది. శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘూయ్‌కు పాకిస్థాన్ డీజీఎంఓ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా హాట్‌లైన్‌లో ఫోన్ చేశారు. ఈ సంభాషణలో కాషిఫ్ అబ్దుల్లా కాల్పుల విరమణ అంశాన్ని ప్రస్తావించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌తో జరిపిన సంభాషణను కూడా ఆయన ప్రస్తావించారు. ఈ పరిణామం, కాల్పుల విరమణ ప్రతిపాదన పాక్ ఆర్మీ ఉన్నతాధికారుల నుండే వచ్చిందన్న దానికి స్పష్టమైన సూచన.
అయితే, లెఫ్టినెంట్ జనరల్ ఘూయ్ ఈ విషయాన్ని తన పైఅధికారులకు తెలియజేసినప్పటికీ, పాక్ డీజీఎంఓతో చర్చలు జరపాల్సిందిగా ఆయనకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఉదయం 10:50 గంటలకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ నిర్వహించిన మీడియా సమావేశంలో కూడా పాకిస్థాన్ నుంచి వచ్చిన ఈ ప్రతిపాదన గురించి ఎటువంటి ప్రస్తావన చేయలేదు. ఆ సమావేశంలో, భారత వైమానిక దళం (ఐఏఎఫ్) పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై చేసిన దాడులు, వాటి వల్ల కలిగిన నష్టాలను మాత్రమే ఆయన వెల్లడించారు. ఆసక్తికరంగా, ఉదయం 11 గంటల ప్రాంతంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు ఫోన్ చేసిన సమయానికి ఐఏఎఫ్ దాడులను మరింత ఉధృతం చేసింది.
పాక్ వాయుసేనకు అత్యంత కీలకమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్ ను ధ్వంసం చేసింది. దాంతో పాక్ హడలిపోయింది. కీలక సైనిక, వైమానిక స్థావరాలను భారత్ లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుండడంతో తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ దశలోనే పాక్ నుంచి కాల్పుల విరమణ ప్రతిపాదన భారత్ కు అందింది.
ఇక అమెరికా విదేశాంగ మంత్రితో సంభాషణ అనంతరం జైశంకర్ ఎక్స్ (ట్విట్టర్) లో చేసిన పోస్టును బట్టి, "భారత్ వైఖరి ఎప్పుడూ ఆచితూచి, బాధ్యతాయుతంగానే ఉంటుంది, ఇప్పుడూ అదే విధంగా ఉంది" అని రూబియోకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఉద్రిక్తతలు తక్షణమే తగ్గించాలని రూబియో పట్టుబట్టినప్పటికీ, అప్పటి పరిస్థితులను బట్టి ఆ ప్రతిపాదనకు జైశంకర్ ప్రాధాన్యత ఇవ్వలేదని అర్థమవుతోంది. అదే సమయంలో... ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేష్ త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, ఐబీ, రా చీఫ్‌లు తపన్ డేకా, రవి సిన్హా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారంతా, భారత్ ప్రస్తుతం పైచేయి సాధించిందని, ఈ ఆధిక్యతను మరింత పటిష్టం చేసుకోవాలనే ఏకాభిప్రాయానికి వచ్చారు. పాకిస్థానే స్వయంగా కాల్పుల విరమణకు ముందుకు రావడం కూడా భారత్ ఆధిక్యతను సూచిస్తోందని వారు విశ్లేషించుకున్నట్లు తెలిసింది. బలగాల అధిక మనోస్థైర్యం, తగినంత ఆయుధ సంపత్తి, ఆర్థికంగా మెరుగైన స్థితి, అంతర్జాతీయ సానుభూతి, హిందూ మహాసముద్రంలో భారత నౌకాదళం 'బ్లూ వాటర్' సామర్థ్యం వంటి అంశాలు భారత్‌కు అనుకూలంగా ఉన్నాయని సమావేశంలో అంచనా వేశారు.
ఇలాంటి పరిస్థితుల నడుమ, కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం అనేకమందిని ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై అంతర్జాతీయంగా మరో వాదన ప్రచారంలో ఉంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుక్రవారం నాడు ప్రధాని మోదీకి ఫోన్ చేసి, పాకిస్థాన్ ప్రమాదకరంగా ఉద్రిక్తతలను పెంచే ప్రణాళికలపై (బహుశా అణ్వాయుధాల ప్రయోగం కావచ్చు) అమెరికా నిఘా సమాచారాన్ని పంచుకున్నారని, దీనివల్లే భారత్ వెనక్కి తగ్గిందని రక్షణ వర్గాలను ఉటంకిస్తూ సీఎన్ఎన్ వార్తా సంస్థ పేర్కొంది.
అయితే, ఈ వివరణ కూడా పూర్తిస్థాయిలో సంతృప్తికరంగా లేదని కొందరు భావిస్తున్నారు. ఎందుకంటే, పాకిస్థాన్ తన అణ్వాయుధాలను ప్రయోగించడానికి వెనుకాడబోమని గతంలో అనేకసార్లు బహిరంగంగానే ప్రకటించింది. అంతేకాకుండా, వాన్స్ సలహా ఇచ్చిన 24 గంటల తర్వాత కూడా భారత్ దాడులతో ఒత్తిడి పెంచుతూనే వచ్చింది. అయినప్పటికీ పాక్ ఆత్మరక్షణ ధోరణిలోనే ఉండిపోయింది తప్పితే, తెగించి దాడులు చేయలేకపోయింది. దానికితోడు, శనివారం నాడు పాకిస్థాన్ తన అణ్వాయుధాలను పర్యవేక్షించే నేషనల్ కమాండ్ అథారిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఆ తర్వాత రద్దు చేసుకోవడాన్ని భారత్ పరోక్షంగా ఎగతాళి చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. గమనించాల్సిన విషయం ఏమిటంటే... ఈ కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో, రేపు (మే 12) భారత్–పాక్ మధ్య హాట్ లైన్ లో డీజీఎంఓల స్థాయిలో జరగనున్న చర్చల అనంతరం భారత ప్రభుత్వ పెద్దల నుంచి ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# వికలాంగుల హక్కుల జాతీయవేదిక ఎన్ పి ఆర్ డి

*వికలాంగుల హక్కుల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయండి.*

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 11**



ఎన్. పి.ఆర్.డి.జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్. 16,17 న ధర్నా, ముట్టడి కార్యక్రమం కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. మండల కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో దగ్గర వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ఎన్.పి.ఆర్.డి. జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగాఉన్న వికలాంగులందరికీ అంత్యోదయా రేషన్ కార్డ్స్ ఇచ్చి అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి దాంట్లో కూడా వికలాంగులకు స్పెషల్ కోట లో వికలాంగులకు ఇండ్లు కూడా మంజూరు చేయాలని కోరడం జరిగింది. అదేవిధంగా 2010 నుండి పెన్షన్ పొందుతున్న ప్రతి వికలాంగులకి యూ డి ఐ డి కార్డు పంపిణీ చేయాలని, స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసిన వారికి వెంటనే ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో వికలాంగులతో ప్రత్యేకంగా శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు జారీ చేసి 150 రోజులు పని కల్పించాలి. రోజుకు 600 ఇవ్వాలని కూడా డిమాండ్ చేయడం జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమస్యలతో సతమతమవుతున్న వికలాంగులకు చేయూతనిచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కూడా ఎన్పిఆర్డి గా డిమాండ్ చేస్తున్నాము. అదే విధంగా ఈనెల 16, 17 తేదీల్లో జరగబోయే ధర్నాకు అనేక మంది వికలాంగులు వచ్చి తమ ఆవేదనని చెప్పుకోవాలను కూడా మండల వికలాంగులకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి మండల అధ్యక్షులు బలుగూరు అంజయ్య, మండల కార్యదర్శి గిరికల లింగస్వామి, మండల ఉపాధ్యక్షులు నాగు నరసింహ, మండల కమిటీ సభ్యులు ఉన్న శ్రీధర్, నరసింహ, భాషయ్య, కాంత్ కుమార్, సత్యనారాయణ, పరశురాములు, రామన్నపేట మండల కమిటీ తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి శ్రీ బండారి మల్లికార్జున స్వామి దేవస్థానం గౌరవ కార్యనిర్వాహక అధికారి అన్నపూర్ణ గారిని శాలువాతో సత్కరించిన భీమ లక్ష్మణ్

కొమురవెల్లి వెలుతురు మే 11:
మదర్స్ డే సందర్భంగా కొమురవెల్లి శ్రీ బండారి మల్లికార్జున స్వామి దేవస్థానం గౌరవ కార్యనిర్వాహక అధికారి అన్నపూర్ణ గారిని శాలువాతో సత్కరించి గౌరవించడం జరిగింది. ఈ సత్కార కార్యక్రమంలో పాక్స్ మాజీ చైర్మన్ కామెడీ రమేష్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమ లక్ష్మణ్ పాల్గొన్నారు. వారు మాతృత్వ మహిమను కొనియాడుతూ, మహిళల ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరం పై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా శ్రీమతి



అన్నపూర్ణ గారికి మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

## బాల సంస్కార్ 2025 వేసవి శిక్షణ శిబిరం విద్యార్థుల భవిష్యత్తుకు దోహదం...

***శిబిరముగింపు కార్యక్రమంలో సీఏ నిరంజన చారి, గాజుల రవీందర్, మధుసూదన్ రావు***

**కరీంనగర్ వెలుతురు మే 11:**

మాధవ సేవా సమితి కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల సంస్కార్ 2025 వేసవి శిక్షణ శిబిరం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదం చేస్తుందని సి ఏ నిరంజనా చారి, బాల సంస్కార్ నిర్వాహకులు మధుసూదన్ రావు, ప్రధానవక్త గాజుల రవీందర్ తెలిపారు. ఆదివారం రోజున కరీంనగర్ పట్టణంలోని మాధవ నిలయంలో బాల సంస్కార్ 2025 వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఇట్టి ప్రోగ్రాంకు ముఖ్య అతిథులుగా వక్తలుగా హాజరైన వారు మాట్లాడుతూ 10 రోజులపాటు జరిగిన బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాలు, విషయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా ఆసనాలు, సూర్య నమస్కారం, దేశభక్తి పాటలు, సంస్కృతంలో స్వీయ పరిచయం , భజన, పిల్లల మధ్య సఖ్యత, జట్టు విధానం లాంటివి విద్యార్థులను ఉన్నత మార్గం వైపు నడిపిస్తాయన్నారు. ఏ దేశంలో లేని విధంగా మన భారతదేశంలో విద్యార్థుల అభివృద్ధిలో తల్లి పాత్ర కీలకంగా ఉంటుందని , తల్లి అంకితభావం గర్వకారణం లాంటిదన్నారు. ఉద్యోగుల కు తీరిక లేక నైతికతకు, విలువలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి శిక్షణ శిబిరాలు విలువలు నైతికతను పెంపొందించడానికి తోడ్పాటును అందిస్తాయన్నారు. విలువలు అనేవి చెప్పడం ద్వారా రావని , గ్రహించడం ద్వారా ఎదుటివారిని చూసి అనుకరించడం ద్వారా అభివృద్ధిలోకి, ఉన్నత స్థితికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. తాతలనాటి తరతరాల, సంస్కృతి సాంప్రదాయాల గురించి తల్లితండ్రులు పిల్లలకు తెలియజేయాలని , విలువల గురించి చెప్పాలని తెలిపారు. మార్కులు కాదు , జ్ఞానం ముఖ్యమని, ఉన్నత చదువులు కాదు ఉన్నత విలువలు




ముఖ్యమని చెప్పారు., ఐఐటీలు, విదేశాలకు వెళ్లాలని డబ్బుల సంపాదనలో పడి యంత్రాల వలె పనిచేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుకు కావలసిన జ్ఞాన సముపార్జన, ధార్మిక విలువలు పెంపొందించడానికి తగిన కృషి చేయాలని తెలిపారు. సమాజంలో ఉన్న ప్రస్తుత విధానాలు , వింత పోకడలు , పద్ధతులు మార్చుకోకపోతే యువతరం భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమం లో పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ పది రోజులు జరిగిన బాల సంస్కార్ శిబిరం వల్ల తమ పిల్లల్లో సత్పరివర్తన తీసుకువస్తుందని ఆశ ఉందన్నారు. పిల్లలకు కుటుంబ విలువల గురించి తెలియజేయడంసంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని మాతృహస్త భోజనంతో ముగించారు. ఇట్టి కార్యక్రమంలో నగర కార్యవాహ చామ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యారులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఈఓ గవ్వ జ్యోతి

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 11**



వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట ఎంఈఓ గవ్వ జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. మే నెల 15 వ తేది నుండి 15 రోజుల పాటు 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ఈ శిబిరంలో ఇండోర్, ఔట్ డోర్ క్రీడలు అలాగే స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం తదితర విభాగాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ శిబిరాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామన్నపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంద్రపాలనగరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లంకిలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల పరిసర ప్రాంత విద్యారులు ప్రధానోపాధ్యాయులను సంప్రదించి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ డి మండల విద్యాధికారిణి రామన్నపేట.

## బీరప్ప గుడిని సందర్శించిన తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయికుమార్

***సన్మానించిన మత్స్య పార శ్రామిక సహకార సంఘం చైర్మన్ కందుల హనుమంతు***

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 11**



మండల కేంద్రంలో ఆదివారం ఉదయం బీరప్ప గుడిని. సందర్శించిన తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్. ని ఘనంగా సన్మానించడం జరిగింది.గొరిగి రమేష్, రవి ప్రసాద్. వారి కుటుంబాలతో మాట్లాడిన అనంతరం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కందుల హనుమంతు.రామన్నపేట.ముదిరాజ్ మత్స్య కారుల సమస్యలను కుటుంబ వివరాలను, రాష్ట్ర చైర్మన్ సాయికుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీనికి చైర్మన్ సానుకూలంగా స్పందించి, త్వరలో మీ యొక్క సమస్యలను పరిష్కరిస్తామని, హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోల్ల వెంకన్న, జవాజి, శ్రీకాంత్, సాదుల యాదగిరి, సైదులు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకోటలో ఘనంగా నరసింహ స్వామి జయంతి వేడుకలు

*ప్రవీణయ్య ఆధ్వర్యంలో సుదర్శన మరియు నారసింహ హెూమం నిర్వహణ*

*ప్రత్యేక పూజలు నిర్వహించిన రాచాల*





**కొత్తకోట వెలుతురు మే 11:**
తెలంగాణ ఇలవేల్పు నరసింహ స్వామి జయంతి వేడుకలు కొత్తకోటలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామి జయంతి సందర్భంగా ప్రముఖ వాస్తు, జ్యోతిష్య శాస్త్ర నిపుణులు ప్రవీణయ్య గారి ఆధ్వర్యంలో కొత్తకోట వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వెనకాల పెద్దగుట్ట దగ్గర నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ఆవరణలో పూజారి రాజేష్ బృందం ఉదయం సుదర్శన హెూమం, నారసింహ హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నరసింహ రాజు రాచాలను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక్కడికి విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాదం, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శివానంద స్వామి, శ్రీనివాస్, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనపూర్ గ్రామంలో ఘనంగా మల్లన్న స్వామి జాతర

*"ప్రజలపై భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి"*

**- కాట శ్రీనివాస్ గౌడ్**



**పటాన్‌చెరు వెలుతురు మే 11:**
పటాన్‌చెరు మండలంలోని ఘనపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి జాతర మహెూత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ పవిత్ర ఉత్సవంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు.

## జ్యూస్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ జి. మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 11:**
మీ స్వీకారం ఉండాలంటే ప్రజలు ఎండలతో బాధపడుతున్న సమయాన శ్రీ సుంకేశ్వర్ భర్తీ ఆవంశివా మండల్ హైదర్గూడా వారి ఆధ్వర్యంలో ఆదివారం రోజున షుగర్ క్రీం జ్యూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ కార్పొరేటర్ జి. మహాలక్ష్మి రామన్ గౌడ్ అధ్యక్షులు రాజీవ్, కార్యదర్శి మహేందర్, కన్వీనర్ పంకజ్, హిరెన్, అతుల్, కుష్, సందేశ్, డోనార్స్. గ్యాంచంద్ సందేశ్ చొరడియా ఫ్యామిలీ రాధా ఎంక్లేవే వెల్ఫేర్ అసోసియేషన్ హిమాయత్నగర్.

## మా సోదరుడి వివాహానికి తప్పనిసరి రండీ...





**వెలుతురు, హైదరాబాద్ 11మే:**
ఈ నెల 14వ బుధవారం తేదీన వెల్దండ మండల పరిధిలోని కోట్ర గెట్ సమీపంలోని బిజిఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగే తన సోదరుడి వివాహనికి రావాలనీ కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డిని, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ను సీనియర్ జర్నలిస్ట్ మల్లెపాకుల పరుశురామ్ ఆహ్వానించారు. హైద రాబాద్ లోని వారి నివాసంలో వేరు వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజే శారు. ఈ కార్యక్రమంలో నృపాల్ నాయక్, రాములు యాదవ్, వెలి జాల వెంకటేష్ , బాషా, సైదులు, అశోక్ నాయక్, మున్నా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల బిల్స్ వెంటనే విడుదల చేయాలి

*బికేయంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య*



**చేవెళ్ల వెలుతురు మే 11:**
తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల మహాసభలు అంబేద్కర్ భవన్లో జరిగాయి ఈ మహా సభలకు ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతాయ్య మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనులు చేసే దగ్గర కనీస వస్తువులైన మంచినీళ్లు టెంటు వైద్య కిట్టు రవాణా సౌకర్యం పారలు గడ్డపారలు ఇలాంటివి లేకుండా సౌకర్యాలు ఏవి లేకుండా పనులు చేయిస్తున్నారని ఇదెక్కడి న్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఉపాధి కూలీలు పనులు చేస్తుంటే కనీస వేతనం కూడా రావడంలేదని ఐదు వారాల నుంచి ఉపాధి కూలి డబ్బులు పెండింగ్లో ఉన్నాయని ఏం తిని పనిచేయాలో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన అడిగారు ఎన్ఆర్ఈజీఎస్ కు రెండు లక్షల 85 వేలకోట్ల రూపాయలు కేటాయించి కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి 700 ఇవ్వాలని 200 రోజులు పనులు కల్పించాలని కూలి లందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని పెండింగ్ బిల్స్ వెంటనే విడుదల చేసి వారి అకౌంట్లో వేయాలని ఆయన డిమాండ్ చేశారు లేనియెడల ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ 2005 కు ముందు వామపక్ష పార్టీలు వ్యవసాయ కార్మిక సంఘాలు వ్యవసాయ కార్మికులకు సమగ్రమైన చట్టం కావాలని పోరాడితే 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకం తీసుకువచ్చి పేద ప్రజలకు పనులు కల్పిస్తుందని అది ఎర్రజెండా సిపిఐపోరాట ఫలితమని కానీ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి పథకానికి నిధుల కోత విధించి నిర్వీరియ పరుస్తూ పథకాన్ని ఎత్తేక్ష దిశలో ఆలోచన చేస్తుందని ఆయన మండిపడ్డారు ఉపాధి కూలీల పథకాన్ని జోలికి వస్తే ఖబర్దార్ అని మోదీ బిజెపిప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె రామ స్వామి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభులింగం బి కే ఎన్ యుజిల్లా అధ్యక్షులు జే అంజయ్య ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ మహిళా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు మక్బూల్ బికేఎంయు నాలుగు మండలాల శంకర్పల్లి మండల అధ్యక్షులుగా యశోద కార్యదర్శిగా కుందన భాయ్ షాబాద్ మండల అధ్యక్షులుగా వెంకటేష్ కార్యదర్శిగా ఎస్ రాములు మొయినాబాద్ మండల అధ్యక్షులుగా మల్లేష్ కార్యదర్శిగా టీ నర్సింహులు చేవెళ్ల మండల అధ్యక్షులుగా సత్యనారాయణ కార్యదర్శిగా నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నాలుగు మండలాల సిపిఐ మండల కార్యదర్శి నక్క జంగయ్య సత్తిరెడ్డి శ్రీనివాస్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు

# సీతారాంపురం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతుల సత్కారం

*- కెరీర్ గైడెన్స్ తో విద్యార్థుల్లో కొత్త జోష్*



**సీతారాంపురం వెలుతురు మే 11:**
సామాజిక సేవలో ముందుండే సీతారాంపురం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకుంది. ఆదివారం రోజున ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలోని పదోతరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు, పరీక్షల ప్రాధాన్యత, కోర్సుల ఎంపిక తదితర అంశాలపై నిపుణుల సమగ్ర వివరాలతో పాఠాలు ఇవ్వబడినాయి. ఇందులో భాగంగా, ఈ విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ట్రస్ట్ తరపున ఘనంగా సత్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేయడం జరిగింది. గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటున్న ఈ కార్యక్రమం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని బలపరిచేలా సాగింది. ఈ కార్యాచరణ పూర్తిగా సీతారాంపురం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చేత నిర్వహించబడింది. ట్రస్ట్ సభ్యుల శ్రద్ధ, సేవా దృక్పథం, విద్యార్థులపై చూపుతున్న ఆసక్తి ఎంతో స్పష్టంగా కనిపించింది. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ, "గ్రామ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని విజయపథంలో నడవాలన్నదే మా లక్ష్యం. ప్రతి ఏటా ఇలా వారిని ప్రోత్సహించడమే మా బాధ్యతగా భావిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ట్రస్ట్ సభ్యులకు గ్రామస్తుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.




ఆర్మీక ఆన్లైన్ కోచింగ్ టెస్ట్ సిరీస్ ను ప్రారంభించిన డాక్టర్ ప్రసన్న హరికృష్ణ, ఆర్ సి ఎక్సమ్ కిరణ్ కుమార్, కార్మిక ఆన్లైన్ ఎక్స డైరెక్టర్ పూర్ణచందర్ మరియు మాడుగుల నరసింహ తదితరులు పాల్గొన్నారు
హైదరాబాద్ వెలుతురు మే 11:

# అటు నుంచి తూటా వస్తే, ఇటు నుంచి బాంబు వెళ్లాలి!


## ఆర్మీకి స్పష్టం చేసిన మోదీ!

*రక్షణ శాఖ అధికారులతో ప్రధాని మోదీ సమావేశం*

*తూటాకు తూటానే సమాధానం ఇవ్వాలంటూ ప్రధాని మోదీ ఆదేశాలు!*

*పాక్ దాడి చేస్తే మన ప్రతిదాడి శక్తిమంతంగా ఉండాలని స్పష్టీకరణ*

**ఢిల్లీ, వెలుతురు మే 11:**



సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించేది లేదని, వారి కాల్పులకు దీటైన జవాబు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాయుధ బలగాలకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. 'తూటాకు తూటానే సమాధానం' అనే రీతిలో ప్రతిస్పందన ఉండాలని స్పష్టం చేసినట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. ఏఎన్ఐ కథనం ప్రకారం... "అక్కడి నుంచి ఒక తూటా పేలితే, ఇక్కడి నుంచి బాంబు వెళ్లాలి. సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి పాకిస్థాన్ సైన్యం కాల్పులకు తెగబడితే, భారత బలగాలు మిస్సైళ్లతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలి. వారు కాల్పులు ప్రారంభిస్తే, మనం రెట్టింపు స్థాయిలో కాల్పులు జరపాలి. వారు దాడి చేస్తే, మనం మరింత శక్తివంతంగా ప్రతిదాడి చేయాలి" అని ప్రధాని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఆదేశాలతో భారత సాయుధ బలగాలు సరిహద్దుల్లో ఎలాంటి దుస్సాహసానికైనా దీటుగా బదులిచ్చేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాయి. పీఓకేపై భారత్ వైఖరి, ఆపరేషన్ సింధూర్ కొనసాగింపు వంటి పరిణామాలు పాకిస్థాన్‌కు స్పష్టమైన సందేశాన్ని పంపుతున్నాయి.

# జయహెూ నాయకా..!

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 11

జోహారు జోహారు నాయకా..
జయహెూ జయహెూ మురళీ నాయకా..
జన్మ భూమికై మీది ప్రాణార్పణం....
ధీరత్వానికి అదే అంకురార్పణం....
మీ శరీరానికే కదా మరణం ...
మీ ఆత్మ సదా వెలుగుల ప్రసరణం ....
ఉరకలెత్తించే మీ రుధిర ధారణం..
నేటి యువతకయ్యే రణ సింధూరం..
దేశ జనతకూ అదే నిత్య ప్రేరణం..
భారతావని.. మదికీ సదా స్మరణం ..
ఆసేతు భారతం జనగణమనమంటుందీ...
మీ శౌర్యం మ్రోగే ఘనఘనఘన గంటందీ....
పాకీ ముష్కరుల గుండె అదిరి చెదిరె భలభలమని..
నిప్పు ఖనికలై మీరు ఎగసినారు ఫెళఫెళమని...
తెలుగు వారి సూర్య పుత్ర మీరెలే ..
మిము కన్న మాతృభూమి ప్రాణ ధారలే ....
జన జాగృత వీర జవాన్మీరయా...
జయ భారత స్థైర్య హవా మీరయా...
భరతమాత ముద్దు బిడ్డలేనయా..
మాతృభూమి ఋణం తీర్చినారయా..
మరువలేము మేము మీ త్యాగమూ...
సదా కీర్తి శిఖరమే మీ యాగమూ...

( పాకీ ముష్కరులతో యుద్ధంలో అమరులైన మురళీ నాయక్ సహచర జవానులకు వినమ్ర కవితాంజలి.. )



**పాల్వంచ హరికిషన్**
రామన్నపేట
9502451780

# తాటి చెట్టు పై నుంచి పడి గీతా కార్మికుడు మృతి..



**వెలుతురు,నెల్లికుదురు:**
తాటిచెట్టు పైన నుంచి పడి గీతా కార్మికుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన చీకటి ప్రభాకర్ గౌడ్(48) యధావిధిగా తాటి చెట్టు నుంచి కల్లు తీయడానికి ఆదివారం మధ్యాహ్నం తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య నరసమ్మ, ఓ కుమారుడు,ఇద్దరు కూతుర్లు ఉన్నారు.కాగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని పార్తివదేహాన్ని పోస్ట్ మార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పేదరికంలో ఉన్న ప్రభాకర్ గౌడ్ ఆకస్మిక కన్నుమూతతో కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు కోల్పోయి ఆ కుటుంబం తీవ్ర కష్టాలలో కూ రుకు పోయినట్లయింది.సంబంధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు గీతా కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.